# తలచినదే...

-యం.వెంకటేశ్వరరావు

"అమ్మాయ్ కస్తూరీ! కాస్త కాఫీ ఇస్తావా?" కోడల్ని కాఫీ అడిగిన అమ్మ గొంతు విని బద్ధకంగా పక్కమీద నుంచి లేచాను.

"పాలొచ్చాయి కదా. కాఫీ కలుపుకుని తాగలేరా? ఛ... ఈ ముసలాళ్ళకి వండి వార్చడంతోనే నాకు వయసైపోయేలాగుంది" అంది పక్కన పడుకున్న కస్తూరి లేస్తూ.

అప్పటికే అమ్మ లేచి అంట్లు తోముతోంది కాబోలు కిచెన్ నుండి శబ్దం వస్తోంది.

"మురళీ! మురళీ" అంటూ హాల్లోకెళ్లింది కస్తూరి.

నాన్న హాల్లో టీవీలో వస్తున్న సాయిబాబా భక్తిగీతాలు చూస్తుంటే మురళి తాత పక్కన కూచుని టీవీ చూడడం చూసిన కస్తూరి-

'నీకూ ప్రొద్దునే పనీ పాటా లేదట్రా? టీవీ ముందు రాయిలా కూచున్నావు. స్కూలుకి టైమవుతోంది లే అక్కడ్నుంచి" అని కొడుకుని కసిరింది.

నాన్న టీవీ ఆఫ్ చేసి మౌనంగా పడక్కుర్చీలో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు.

నేను బ్రష్ చేసుకుని హాల్లోకొస్తూ "కస్తూరీ నాకు కాఫీ ఇస్తావా?" అన్నాను.

"ఇదిగో ఐదు నిముషాల్లో వస్తున్నాను" అంది సాఫ్ట్‌గా.

ఏదో విసురుగా బదులొస్తుందని ఆశించిన నేను కస్తూరి మాట విని రిలాక్స్‌డ్‌గా పేపరు చూస్తూ కూర్చున్నాను.

"రమణా! కాళ్లు పైకి పెట్టుకో" ఇల్లు చిమ్ముతున్న అమ్మ గొంతు విన్పించింది.

అంతే! పేపరు మీద ధ్యాస దారి తప్పింది. పేపరడ్డు పెట్టుకుని అమ్మని గమనించసాగాను.

"కస్తూరి! కాఫీ త్వరగా పట్రా" మళ్లీ అడిగాను.

మరు నిముషంలోనే వేడి కాఫీ నాకూ, అమ్మకీ తెచ్చి టీపాయ్ మీద వుంచి వెళ్లింది కస్తూరి.

"మమ్మీ! నాకూ త్వరగా కాంప్లానివ్వు?" అడిగాడు మురళి.

"ఏరా! నాకేమైనా నాలుగు చేతులున్నాయా? కాస్త లేటయితే నాలుక పీక్కుపోతుందా? లేచెళ్లి స్నానం చేసిరా?"

టీపాయ్ మీదున్న కాఫీ గ్లాసందుకోబోతున్న అమ్మ కస్తూరి మాటలువిని ఆగిపోయి సగం చిమ్మిన ఇల్లు పూర్తి చేయడానికి వెళ్తుంటే...

"కాఫీ తాగాక చిమ్మొచ్చుగదమ్మా" అన్నాన్నేను.

"ఈ కాస్తా చిమ్మి వస్తాను" అనెళ్లి పూర్తయ్యాక చేతులు కడుక్కొచ్చి కాఫీ తాగుతున్న అమ్మని చూసేసరికి ఎక్కడో కలుక్కుమన్నట్లుగా అనిపించి పేపరడ్డుపెట్టుకున్నాను.


మొదట్నుంచీ అమ్మకి ఉదయం లేవగానే వేడి వేడి కాఫీ తాగే అలవాటు. కాఫీ గొంతు దిగితే చాలు మరుక్షణమే ఫ్యాక్టరీలో యంత్రంలా ఎంత పనైనా చేసుకుపోతుంది. అలసట అమ్మ ఛాయలకి రావడానికే భయపడుతుందేమో అన్పించేది.

***

ఆ మధ్య ఓసారి ఉదయం నిద్రలేచిన అమ్మ తలనొప్పిగా ఉందని, కాఫీ కలుపుకు తాగుదామని పాలు స్టౌ మీద వుంచి హాల్లోకొచ్చి కూచుంది. పాలు పొంగి కిందపోవడం అమ్మ గమనించలేదు. అప్పుడే కిచెన్లోకొచ్చిన కస్తూరి అది చూసి పెద్దావిడ అన్న విచక్షణ లేకుండా నాలుక నరం లేనట్టు మాట్లాడి "ఇహమీదట నేను కాఫీ ఇచ్చేవరకూ ఈ ఛాయలకి రాకండి" అని దులిపింది.

***

అమ్మకి అది గుర్తొచ్చింది కాబోలు నేను కాఫీ గ్లాసు కింద పెడుతుంటే తీసుకుని "ఏళ్ళ తరబడి పాతుకుపోయిన అలవాటు... ఏరి పారేయడం ఎలాగో అర్థం కావట్లేదు. ఎంత సంభాళించుకున్నా ఆ టైమయ్యేసరికి వెధవ మనస్సు వెంపర్లాడుతుంది. అయినా వయసుడిగాక నాలాంటి వాళ్ళకి



వేళావేళకి అన్నీ అందాలంటే వీలవుతుందా?' అంది అమ్మ లోపలికెళుతూ.

పేపరు పక్కన పడేసి "అమ్మ! కస్తూరి సంగతి నీకు తెలియనిదా? మాట తీరే అంతగానీ మనసు మంచిదే" సర్ది చెప్పబోయాను.

"పోన్లేరా! కస్తూరి నిన్ను బాగా చూసుకుం టుంది. మాకదే చాలు" అనేసి లోపలకెళ్లింది. ఆ మాటలోని అర్థం అర్థమయి మనసు చివుక్కు మంది.

★★★


ముగ్గురు ఆడపిల్లల తరువాత పుట్టిన వాణ్ణవ్వడంవలన నా బాల్యం అందరి గారాబం మధ్య విజయవాడలో సాగింది. నాన్న ప్రైవేటు కంపెనీలో పనిజేసేవాడు. అమ్మ పిల్లలకి సంగీతం నేర్పుతూనే రేడియోలో తరచూ ప్రోగ్రాం ఇస్తుండేది.

నాన్న జీతానికి అమ్మ అదనపు సంపాదన తోడై ఆర్థికంగా పెద్ద ఇబ్బందులు లేకపోయినా ఇద్ద రక్కయ్యలకి పెళ్లిళ్లయ్యాక కష్టాలు ఎదుర్కోవాల్సి వచ్చేది. నాన్న రిటైర్మెంట్ డబ్బుతో చివరి అక్కకు పెళ్లయితే చేయగలిగారుకానీ ఉండడానికి చిన్న ఇల్లు ఏర్పరచలేకపోయారు. అప్పటికే డిగ్రీ పూర్తి చేసిన నాకు వెంటనే రైల్వే ఉద్యోగం రావడం, మరు సటి సంవత్సరమే కస్తూరితో కళ్యాణం జరగడం వెంటవెంటనే జరిగిపోయాయి.

అప్పట్నుంచీ అమ్మానాన్నలు నాతోపాటు వుంటు న్నారు. వాళ్లని నా దగ్గరే ఉంచుకోగలుగుతున్నం దుకు గర్వంగానూ, మా అక్కయ్యలెవ్వరికీ దక్కని ఆ అదృష్టం నా సొంతమైనందుకు సంతోషంగానూ వుంటుంది.

అయితే ఆ సంతోషాన్ని అనుక్షణం ఏదోవి ధంగా పాడుచేయడం కస్తూరికి అలవాటయింది. అయినదానికీ, కానిదానికీ అమ్మానాన్నల మీద సూటీపోటీ మాటలు అనడం కస్తూరికి దినచర్యలో భాగంగా మారింది.

అమ్మ ఇప్పటికీ ఇంటి పనంతా చేస్తూనే పది మంది పిల్లలకి సంగీతం నేర్పుతుంటుంది. నా పిల్లల ఆలనాపాలనా చూస్తున్నా సరే కస్తూరికి వాళ్లని చూస్తే చాలు ఏదో అసహనం, ఆవేశం. నేను తనకే సొంత మైనట్లు, వాళ్లు ఉత్తపుణ్యానికి పడున్నట్లు ఉదాసీన పరచడం ఆమెకు ఆటలా అయింది.



## సినిమా

''సుబ్బారావ్! నిన్న ఏ సినిమాకెళ్లావయ్యా?''

''కామెడీ పిక్చర్‌కి వెళ్లాను సార్. పేరు చెబితే బాగుండదు.''

''ఫర్వాలేదు. చెప్పవయ్యా!''

''నేనూ మీ ఆవిడ ప్రేమలో పడ్డాం.''

**-ఎం.ఎస్.లోకనాథ్**
(రాజమండ్రి)

## రాంగ్‌నెంబర్

''హలో!''

''హలో ఎవరండీ?''

''నేను రామదాసుని.''

''ఏమిటండీ హఠాత్తుగా ఫోన్ చేసారు.''

''ఏంలేదు. పంటలు బాగా పండాయా?''

''ఈ ఏడు బ్రహ్మాండంగా పండాయి.''

''మరి నా దగ్గర తీసుకున్న లక్ష రూపాయలు ఎప్పుడిస్తావు?''

''అయితే రాంగ్ నెంబర్!''


**-తంగేటి రామారావు**
(దుగ్గుదుర్రు)

## యుద్ధం

''పానిపట్టు యుద్ధం ఎక్కడ, ఎప్పుడు, ఎవరెవరి మధ్య జరిగిందిరా రాముా?'' అడిగాడు సోషల్ టీచర్.

''నీళ్ళు పట్టుకునేటప్పుడు జరిగేవే పానిపట్టు యుద్ధాలు. మా వీధిలో ప్రతిరోజూ అడపాదడపా ఆడవాళ్ల మధ్య ఇది జరుగుతుంది సార్'' ఠక్కున చెప్పాడు రాము.

**-ఎస్.కె.దుర్గ** (క్యాతూరు)




***

ఆ రోజు ఆదివారం. నైట్ డ్యూటీ చేసొచ్చి పడుకున్నాను.

కస్తూరి రైతుబజారుకెళ్లింది.

అమ్మా నాన్నా టీవీలో భాగవతం చూస్తున్నారు.

బయటకెళ్లొచ్చిన కస్తూరి హాల్లోకొస్తూనే గబగబా టీవీ దగ్గరకెళ్లి స్విచ్చాఫ్ చేసింది.

"ఇంత తిన్నామా ఓ మూలన పడున్నామా అని లేకుండా ఉదయం సుప్రభాతం మొదలు రాత్రి సమాప్తం వరకూ విరామం లేకుండా టీవీ చూస్తూ తిని కూర్చోవడం తప్ప ఏమైనా ఆలోచిస్తున్నారా? కరెంటవుతోంది, ఎలా కడుతున్నారు? ఊహూ... ఇలాంటి విషయాలేవీ పట్టవే. ఇలాంటి విషయాలు ఒకళ్లు చెబితే వస్తాయా? ఇక్కడేదో డబ్బులు చెట్టుకి కాస్తున్నట్లు... అర్థం పర్థం ఉండాలి" అని విదిలించేసరికి మ్రాన్పడిన నాన్న లేచి మారు మాట్లాడకుండా బయటకెళ్లాడు.

అప్పటికే నిద్రలేచిన నేను కస్తూరి మాటలు విని పిస్తున్నా అమ్మానాన్నలనెందుకు సాధిస్తున్నావని నిలదీయలేని అశక్తత.

ఎందుకంటే కస్తూరి చేస్తున్న ప్రభుత్వోద్యోగం వల్లనే నేనో ఇల్లు కట్టగలిగాను.

నా జీతం బ్యాంకు లోన్లకి సరిపోగా కస్తూరి జీతమే ఇంటిల్లిపాదికీ సాపాటు పెడుతోంది. సొంత ఇంట్లో కన్నవాళ్లతో కలసి వుండవచ్చని ఆశించానే గానీ వాళ్ళు నా భార్యకి భారమవుతారని భావించలేదు.

అమ్మానాన్న, కస్తూరి ఈ ముగ్గురిలో ఎవరికి నేను ఒంటరిగా కనిపించినా ఒకళ్లమీద ఒకళ్ళు చెబుతూనే ఉంటారు.

అన్నీ విని శ్రోతగానే మిగిలిపోతానే తప్ప ఎవ్వరినీ సమర్థించలేకపోవడానికి కారణం నా అసమర్థత.

భార్యని సమర్థిస్తే అమ్మానాన్నల బాధకి కారణమవుతాను.

అమ్మానాన్నల్ని సమర్థిస్తే వాళ్లని నిరాశ్రయుల్ని చేసినవాణ్ణవుతాను. అందుకే కస్తూరి మీద నా ఆవేశాన్ని వెళ్లగక్కి నిత్యం రభస సృష్టించుకునే కంటే మౌనంగా ఉండడం అలవాటు చేసుకున్నాను.

***

ఆ రోజు సాయంత్రం కస్తూరి మురళిని తీసుకుని బేగంపేటలోవున్న వాళ్ల బాబాయి ఇంటికెళ్లింది.

నాన్న నన్ను పిలిచి-

"నేనూ మీ అమ్మ ఏదైనా వృద్ధాశ్రమంలో చేరిపోదామని ఎన్నోసార్లు అనుకున్నాం. తెల్సినచోట్లలా విచారించాను. ఉచితంగా ఉంటే చోట ఖాళీల్లేవు. ఖాళీలున్నచోట డిపాజిట్ కట్టడానికి మా దగ్గర డబ్బుల్లేవు.

అసలు మా తలరాత బాగుల్లేదు. వయసుడిగిన కాలంలో చిన్నవాళ్లతో పెద్ద మాటలు పడమని, ఆత్మాభిమానం చంపుకుని బ్రతకమని తలరాత మార్చే వీల్లేకుండా బలంగా రాశాడా దేవుడు'' అని మనసులో వేదనంతా చెబుతుంటే హృదయం విలవిల్లాడింది.

***

"రమణా! ఏంటి దీర్ఘాలోచనలో మునిగిపోయావు. ఎప్పట్లా ఇంటి ప్రాబ్లమేనా? లేక ఇంకేదైనా...'' అడిగాడు కొలీగ్ వేణు.

"నాలాంటి వాడికి కొత్త సమస్యలేముంటాయిరా. అమ్మానాన్న భార్యల ముక్కోణపు సిరీస్ తప్ప'' అని వేణుతో నిన్న ఇంట్లో జరిగిన సంఘటన చెప్పాను.

"రమణా! నీకో గుడ్‌న్యూస్‌రా. రెండేళ్లక్రితం మనిద్దరం కలసి ఓ చిట్‌ఫండ్‌లో చేరాం గుర్తుందా. అది ఈ నెలలో పూర్తయింది. వచ్చే ఫస్టుకి మనకి 30,000 వస్తాయి."

"అవునుకదూ. మర్చేపోయాను. థాంక్స్‌రా... సమయానికి గుర్తు చేసావు."

"థాంక్స్ సరేగానీ డ్రింక్ ఒకటి త్రాగించు."

"ష్యూర్!"

ఇంట్లో కస్తూరికి తెలియకుండా నెలనెలా కట్టిన చిన్న మొత్తం ఇప్పుడు ముప్పై వేలు అయింది. ఈ డబ్బులో కస్తూరికి ఎన్నాళ్లనుండో అడుగుతున్న బంగారు గాజులు చేయించవచ్చు. లేదంటే ఇన్‌స్టాల్‌మెంట్లో తీసుకున్న టీవీ, ఫ్రిజ్‌ల బాకీ ఒకేసారి తీర్చేయవచ్చు.

ఇంకా.. ఇంకా... ఎంత ఆలోచించినా కస్తూరి గాజులకే మనసు ఓటేస్తోంది.

ఎందుకంటే ఆ సంతోషంలోనైనా కొన్నాళ్లపాటు అమ్మానాన్నలపై ఆమెకున్న అసంతృప్తి సద్దుమణుగుతుందేమో!

"ఆ డబ్బు ఏం చేయాలని కలలు కనేస్తున్నట్టున్నావు. కాస్తాగి నేను చెప్పేది విను. మీ అమ్మానాన్నల నుండి ఎటువంటి ఆదాయం లేదనేగా మీ శ్రీమతి వాళ్లని చులకనగా చూస్తోంది. ఈ డబ్బు మీ ఆవిడకి తెలియకుండా మీ పేరెంట్స్‌కిచ్చి ఇది వాళ్ల డబ్బుగా నీ భార్యకివ్వమని చెప్పు.''

"వద్దు బాబూ వద్దు. కస్తూరి ఆవలించకుండానే పేగులు లెక్కెస్తుంది. ఇంత సడెన్‌గా వాళ్లకీ డబ్బు ఎక్కడిదని నిలదీస్తుంది. అదీగాక అమ్మానాన్నలు ముందు దీనికి అంగీకరించరు."

"అయితే... ఓ పని చేయి. మీ అమ్మగారు సంగీతం నేర్పేవారన్నావుకదా."

"అవును. ఇప్పుడూ నేర్పుతోంది. అమ్మ ఆలిండియా రేడియోలో అనేకసార్లు ప్రోగ్రాంలిచ్చేది. ఇప్పుడెందుకు?"

"నీ సమస్యకు ఓ సొల్యూషన్ చెబుతాను విను. రేపు ఫస్టు తారీకు. ఆ డబ్బు చేతికి రాగానే మీ అమ్మగారి పేరుతో డిడి తీసి వృద్ధకళాకారుల ఉపకార వేతన పథకం కింద ప్రభుత్వం పంపినట్లు, ఇహపై ప్రతినెలా ఐదువందల రూపాయల పెన్షన్ శాంక్షన్ అయినట్టు ఓ లెటర్ తయారుచేసి పంపు."

"వర్కవుటవుతుందంటావా?"

"నమ్మకంతో చెయ్యి."

***

మర్నాడు డబ్బు చేతికి అందగానే వేణు చెప్పినట్లుగానే చేసాను.

'ఇహమీద కస్తూరి అమ్మానాన్నల్ని సాధించడం మానేస్తుంది. వాళ్ళూ వృద్ధాశ్రమంకెళ్ళే ఊసెత్తరు' అనుకున్నాను.

మూడురోజుల తరువాత సాయంత్రం ఆఫీసు నుండి వస్తూ 'ఈ రోజు అమ్మకి డబ్బు అంది వుంటుంది.

ఎలా స్పందించారో? ముందు అత్తమామల డబ్బు చూసి కస్తూరి ఎలా రియాక్టయిందో' ఆలోచిస్తూనే ఇంట్లోకి అడుగుపెట్టాను.

గుమ్మంలో అమ్మ కన్పించింది. ఎప్పట్లా మామూలుగానే ఉంది. హాల్లో పడకుర్చీలో పడుకున్న నాన్నని చూసాను. మొహంలో ఏదో వైరాగ్యం.

"నాన్నా! ఏంటి అదోలా ఉన్నారు?"

"మామూలుగానే వున్నానుగానీ లోపలికెళ్లి బట్టలు మార్చుకునిరా. మాట్లాడాలి."

లోపలికెళ్లగానే కస్తూరి సంతోషంగా "అత్తయ్యకి ముప్పైవేలు డబ్బొచ్చింది.

ఇహమీద ప్రతినెలా ఐదువందల పెన్షన్ కూడా వస్తుందిట" అంది.

ఇంతకుముందెప్పుడూ అమ్మని 'మీ అమ్మ' అని నాముందు సంబోధించే కస్తూరి కొత్తగా 'అత్తయ్య' అనడం కొత్తనిపించలేదు.

నేను మౌనంగా విని ఊర్కోవటం చూసి టీ ఇచ్చింది. టీ తాగి హాల్లోకొచ్చి నాన్న పక్కన కూర్చున్నాను.

కుర్చీ పక్కనుంచుకున్న పుస్తకంలో లెటరు తీసి నాకిచ్చాడు. చదువుతుంటే-

"రమణా! మీ అమ్మకి ప్రభుత్వం వృద్ధ కళాకారుల ఉపకార వేతనం ముప్పైవేలు పంపారు. ఇహమీద పెన్షన్ ఐదువందలు కూడా వస్తుందిట. ఎప్పుడో వృద్ధాశ్రమంలో చేరాల్సింది. డిపాజిట్ డబ్బు కట్టే వసతిలేక ఆగిపోయాం. ఇప్పుడు దేవుని దయవల్ల ఈ రూపంలో డబ్బొచ్చింది. ఇద్దరికీ డిపాజిట్ డబ్బు ఇరవైవేలు కట్టి రేపే వృద్ధాశ్రమంలో చేరాలని నిర్ణయించుకున్నాం. మిగిలిన పదివేలతో కోడలికి ఓ జత గాజులు చేయించాలనుకుంటున్నాం. ఆ పిల్ల ఎన్నాళ్లనుండో అనుకుంటోంది. కోడలికి ఇంతవరకూ ఏం చిన్నమెత్తు బంగారం ఏనాడూ పెట్టలేదు. ఏదో మాకున్నంతలో గాజులు చేయిద్దామనుకున్నాం" అన్నాడు నాన్న.

లెటరు చదివి పక్కనబెడుతూ "ఇప్పుడివన్నీ ఎందుకు నాన్నా. మీరిద్దరూ ఎక్కడికీ వెళ్లవద్దు"

"అలాకాదులేరా రమణా! నీ పెళ్లయిన దగ్గర్నుండీ నీతోనే వుంటున్నాంకదా. కొన్నాళ్లపాటు మీకూ విశ్రాంతిగా ఉంటుంది. ఈ ఊళ్ళోనే కదా వుంటున్నాం" అంది అమ్మ.

"అది కాదమ్మా."

"నువ్వేమీ అనుకోవద్దురా. మేం నీకోసం ఏమీ చేయలేకపోయాం. ఏదో చదువు చెప్పించాం. నీ స్వశక్తితో ఉద్యోగం తెచ్చుకున్నావు. నీకోసం ఆస్తి కూడా ఏర్పరచుకోలేకపోయాం. అయినా మా ప్రేమాభిమానాలు మాత్రం వదిలి వెళ్తున్నాం. వారానికోసారి వచ్చి చూసెళ్లడం మర్చిపోకేం. నెలకోసారి కోడల్నీ, పిల్లల్నీ తీసుకురా. నువ్వూ కోడలూ, పిల్లలు సంతోషంగా ఉండాలన్నదే మా కోరిక. మా గురించి ఎక్కువగా ఆలోచించకు" అని అమ్మ నా చేతులు పట్టుకుని కన్నీళ్ళు పెట్టుకుంది.

"అదేమిటమ్మా. నేనుండగా... మీరెక్కడికో వెళ్లడం... ఊహూ వద్దు..."

"అలాకాదులేరా నాన్నా. మేము నిన్నొదిలి ఎక్కడికి వెళ్తున్నాం? ఊళ్లోనేకదా. ఫోన్లున్నాయి. వస్తూ పోతుంటాం. ఉదయమే నేనూ, నాన్న వెళ్లి ఆశ్రమంలో మాట్లాడొచ్చాం. మాకేం భయంలేదు. నువ్వు నిశ్చింతగా వుండు" అంది అమ్మ.

'వీళ్ళిద్దర్నీ నాతోనే ఉంచుకోవాలని నేను చేసిన ప్రయత్నం ఇలా అవుతుందనుకోలేదు.

నేను ఒకటి తలిస్తే ఆ దైవం మరోలా చేశాడేమిటి?' అని నాలో నేను అనుకున్నా.

★



## అది నిజమే

పేరులోనే అదృష్టాన్ని దాచుకుని తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని అచిరకాలంలోనే సంపాదించుకున్న అసిన్ ఎంతో అందంగా ఉంటుంది. ఆమెని చూడగానే లేత కొబ్బరాకు గుర్తుకొస్తుంది. కేరళలోని కొబ్బరి వంటకాల్ని ఆమె ఎక్కువగా తింటుందేమో అన్న అనుమానం వచ్చి ఆ సంగతే అడిగితే అది నిజమేనని ఒప్పుకుంది. 'కేరళ వంటకాలు ఏవైనా నాకిష్టమే. ఈమధ్య షూటింగ్ కోసం హైదరాబాద్‌లో ఉండడంవలన ఇక్కడి ఫుడ్ కూడా అలవాటయింది' అంటోంది చిలిపిబుగ్గల సుందరి అసిన్.

